



ఓర్వకల్లులో విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచనకు 2017లోనే చంద్రబాబు రెక్కలు తొడిగారు. 19 నెలల్లోనే పూర్తి చేసి 2019 జనవరి 8న జాతికి అంకితం చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఇదీ ..అభివృద్ధి అంటే' అని నిరూపించారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ గెలిచి జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికే పనులన్నీ పూర్తయిన విమానాశ్రయానికి పైపై మెరుగులు దిద్ది పునాదుల నుంచి తామే నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చారు. దీంతో 'ఇది కదా అభివృద్ధి' అంటూ అనుకూల పత్రిక పొగడ్తలతో ముంచెత్తింది. ఇది చూసిన జనాలు ముక్కున వేలేసున్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తమదిగా చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆనాడే విచ్చుకున్న రెక్కలు

కర్నూలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి)

రాయలసీమ జిల్లాలు కడప, అనంతపురం, చిత్తూరులో విమానాశ్రయాలు ఉంటే.. కర్నూలులో ఒక్కటీ లేదు. దీంతో ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి, ఐరన్, సిమెంట్.. వంటి పరిశ్రమలు రావాలంటే.. పారిశ్రామికవేత్తలు రాకపోకలకు అనువుగా విమానాశ్రయం నిర్మించాలని ఆనాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు తలచారు. కేంద్ర విమానయాన శాఖ అధికారులను ఒప్పించారు. ఓర్వకల్లు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణ బాధ్యతలు ఏపీ విమానాశ్రయ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎయిర్‌పోర్ట్స్)కు అప్పగించి.. ఓర్వకల్లు సమీపంలో 1,010 ఎకరాలు కేటాయించారు. రూ.110 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2017 జూన్ 21న ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. ఆనాటి బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి చెందిన నిర్మాణ సంస్థ జేఆర్‌సీ-కేసీవీఆర్ జాయింట్ వెంచర్‌గా పనులు చేపట్టింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ చరిత్రలోనే 19 నెలల్లో కొండలు.. బండరాళ్లు పిండి చేసి విమానాశ్రయం నిర్మించింది. 2018 డిసెంబరు 31న ట్రయల్ రన్ విజయవంతమైంది. అదే రోజు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన విమానం (ఫ్లైట్) ఓర్వకల్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. 2019 జనవరి 8న నాటి సీఎం చంద్రబాబు ప్రారంభించి జాతికి అంకితం చేశారు.


2019 జనవరి 8వ తేదీన సీఎం హోదాలో విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు... చిత్రంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత వైసీపీ నాయకుడు ఎస్వీ మోహహన్ రెడ్డిని చూడవచ్చు

- 1,010 ఎకరాల్లో కర్నూలు విమానాశ్రయం
- 2017 జూన్ 21న శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- కొండలు పిండి చేసి ఎయిర్‌పోర్టు నిర్మాణం
- 2019 జనవరి 8న జాతికి అంకితం
- 19 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం.. ట్రైయల్ రన్ విజయవంతం
- ఎన్నికలకు ముందు అదే ఎయిర్‌పోర్టులో దిగిన వైఎస్ జగన్
- రంగులు వేసి.. మెరుగులు దిద్ది 'ఇది కదా అభివృద్ధి' అంటూ తప్పుడు రాతలు


మార్చి 21, 2019న రన్‌వేపై ట్రయల్ రన్


2019 జనవరి 8వ తేదీన ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో ఎంవోయూ

టీడీపీ ప్రభుత్వంలోనే 90 శాతం పనులు..

కొండ రాళ్లను చదును చేసి ఎయిర్‌పోర్ట్‌లో కీలకమైన రన్‌వే, ఆప్రాన్, టెర్మినల్, టవర్ భవనం, రన్‌వే చుట్టూ 9.4 కి.మీలు ప్రహరీ, రన్‌వే చుట్టూ 5.30 కి.మీలు పెరిఫెరల్ రోడ్డు నిర్మించారు. కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు చేరుకోవడానికి వీలుగా 2.4 కి.మీలు అప్రోచ్ రోడ్డు, ప్రయాణికులు, వివిధ వాహనాల రాకపోకలకు వీలుగా 1.7 కి.మీ. పొడవుతో మరో నాలుగు ఇంటర్నల్ రోడ్లు, 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్ (పీటీబీ), టెర్మినల్‌కు ఎదురుగా (రన్‌వే వైపు) 80-85 మంది ప్రయాణించే ఏటీఆర్-760 విమానాలు నాలుగు ఒకేసారి పార్కింగ్ చేసేందుకు ఆప్రాన్ నిర్మించారు. పీటీబీకి బయట వైపు ప్రయాణికులు, కనువిందు చేసేలా సువిశాల ఉద్యానవనం (పార్కు) అభివృద్ధి చేశారు. అంటే 90 శాతం పనులు టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేసి దాదాపు రూ.120 కోట్లకు పైగా ఖర్చు చేశారు. తొలి విడతగా 2019 ఏప్రిల్, మే నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి గన్నవరం, హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రాయలకు డొమెస్టిక్ విమానాలు నడిపాలని, రెండో విడతలో బెంగళూరు, చెన్నైకి ఫ్లైట్ సర్వీసులు ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. సిగ్నల్ వ్యవస్థ పూర్తి చేయాల్సి ఉంటే దానికీ రూ.50 కోట్లు చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేసింది.


ప్రారంభోత్సవ శిలాఫలకం


ట్రయల్ రన్ విమానం నుంచి దిగుతున్న చంద్రబాబు నాయుడు


2019 జనవరి నెలలో జరిగిన ట్రయల్ రన్‌ను వీక్షిస్తున్న స్థానికులు

డబ్బా కొట్టుకుంటూ మభ్యపెట్టే యత్నం

టీడీపీ ప్రభుత్వంలో భూ సేకరణ తదితర పనుల్లోనే 2018 వరకు కాలయాపన చేశారని, 2.2 కి.మీ. రన్‌వే మాత్రమే నిర్మించారని, 2019 మేలో సీఎం జగన్ వచ్చాకే ఓర్వకల్లు విమానాశ్రయం పూర్తి చేసినట్లు 'ఇది కదా అభివృద్ధి' అంటూ సొంత పత్రికలో డబ్బా కొట్టుకున్నారు. జగన్ వచ్చాక చేసింది పది శాతం పనులే. ప్యాసింజర్ టెర్మినల్‌కు ఎదురుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసి విమానాశ్రయాన్ని తామే నిర్మించినట్లు రాసి జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈ కథనాన్ని చదిని జనం ఇదెక్కడి చోద్యం అంటూ అవాక్కవుతున్నారు. ఆ పత్రిక రాతలే నిజమైతే ఎన్నికల ముందు జగన్ జిల్లాలో ప్రచారానికి ప్రత్యేక విమానంలో వచ్చినప్పుడు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఎలా దిగారని ప్రశ్నిస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విమానాల రాకపోకలకు రెండేళ్లు ఆలస్యమైంది. మళ్లీ టీడీపీ ప్రభుత్వమే వచ్చి ఉంటే 2019 మే నెలలోనే విమానాల రాకపోకలు సాగేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విమానాల రాకపోకలు సాగిస్తే ఆ క్రెడిట్ చంద్రబాబుకు వెళ్తుందన్న దురుద్దేశంతో 2021 మార్చి వరకు జాప్యం చేసి తర్వాత రన్‌వేపై విమానం దింపి ఎయిర్‌పోర్ట్ మొత్తం తామే నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చుకోవడం చూసి జనాలు నవ్వుకుంటున్నారు.

ఆ ఘనత చంద్రబాబుదే..



మా ఊరు ఓర్వకల్లు పక్కనే 2017 జూన్‌లో విమానాశ్రయం నిర్మాణానికి ఆనాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మా కళ్ల ముందే ఏడాదిన్నరలోగా పనులు పూర్తి చేసి చంద్రబాబే ప్రారంభించారు. ఆ రోజు విమానాశ్రయానికి మేము కూడా వెళ్లాం. ముమ్మాటికి ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. మళ్లీ చంద్రబాబు వచ్చి ఉంటే ఓర్వకల్లు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించేంది. జగన్ వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.

- గోవిందరెడ్డి, రైతు, ఓర్వకల్లు

ఇది సాధ్యమా అనుకున్నాం



ఓర్వకల్లుకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందంటే అది చంద్రబాబు వల్లనే. మా ఊరి పక్కనే కొండ రాళ్ల మధ్య విమానాశ్రయం నిర్మిస్తామని ఆనాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ఈ రాళ్లలో సాధ్యమయ్యే పనేనా అనుకున్నాం. రెండేళ్లలోపే పనులు పూర్తి చేసి విమానాన్ని కూడా రన్‌వేపై దింపారు. ఆ రోజు మా ఊరు జనమంతా వెళ్లి చూశాం. పనులన్నీ టీడీపీ ప్రభుత్వంలోనే అయిపోయాయి. జగన్ వచ్చాక రెండోసారి ప్రారంభం అంటే నవ్వుకున్నాం.

- జీసీ అల్లాబాబు, ఓర్వకల్లు

మళ్లీ టీడీపీ వచ్చి ఉంటే



గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు ఓర్వకల్లులో విమానాశ్రయం నిర్మించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విమానం కూడా దిగింది. ఎయిర్‌పోర్టు ఒక్కటే కాదు.. ఓర్వకల్లుకు ఆసియాలోనే అతిపెద్ద వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ యూనిట్, జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమ. డీఆర్‌డీవో వంటివి తీసుకొచ్చారు. ఉర్దూ యూనివర్సిటీ కూడా ఇక్కడే కట్టారు. జగన్ వచ్చాక ఉర్దూ యూనివర్సిటీకి ఒక్క రాయి కూడా వేయలేదు. విమానాశ్రయం కట్టామంటే ఎలా నమ్మాలి.

- సుభాన్, భవన నిర్మాణ కార్మికుడు, ఓర్వకల్లు


మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

రాజ్‌విహార్‌లో రాస్తారోకో..

40 రోజులకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



కర్నూలు(హస్పిటల్), జనవరి 20: అంగన్‌వాడీల సమ్మె 40వ రోజుకు చేరింది శనివారం ప్రభుత్వ నిరంకుశ చర్యలను వ్యతిరేకిస్తూ నగరంలోని రాజ్‌విహార్ సెంటరులో గంటసేపు అంగన్‌వాడీ ఉద్యోగులతోపాటు కార్మిక సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అంజిబాబు, ఎస్. మునెప్ప, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అంగన్‌వాడీలను బెదిరిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించకపోతే రాష్ట్రంలోని ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర బంద్‌కు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. శనివారం గార్గేయపురం సెక్టారుకు చెందిన అంగన్‌వాడీలు, ఆయాలు దీక్షలో కూర్చున్నారు.



రాఘవరాముడు

- మంత్రాలయంలో 59 అడుగుల ఏకశిలా విగ్రహం
- దక్షిణ అయోధ్యగా గుర్తింపు తీసుకొస్తాం
- మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జనవరి 20: మంత్రాలయం రాఘవరాయడి చెంతన భారీ 59 అడుగుల శ్రీరాముని ఏకశిల విగ్రహ ఏర్పాట్లు పూర్తి స్థాయికి చేరాయి. శనివారం భారీ క్రేన్లతో ముందుగా తయారు చేయించిన శ్రీరాముని విగ్రహాన్ని పీఠంపై నిలబెట్టారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముని ఏకశిల విగ్రహాన్ని భారీ క్రేన్ల సాయంతో ఏర్పాటు చేయించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మంత్రాలయంలోనూ ఏకశిల శ్రీరామున్ని ప్రతిష్ఠించాలని ధ్యేయంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. దక్షిణ అయోధ్యగా మంత్రాలయాన్ని తీర్చిదిద్దడం ప్రయత్నాలు చేస్తున్నట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చెప్పారు. 2022 జూన్ 15వ తేదీ నుంచి అనంతపురం జిల్లా నుంచి భారీవాహనంపై 15 అడుగుల వెడల్పుతో 270 టన్నుల బరువు గల ఏకశిలను తీసుకువచ్చారు. అభయ శ్రీరామ ట్రస్టు అధ్యక్షులు బెంగుళూరు చెందిన క్రిష్ణమూర్తి, కార్యదర్శి హైదరాబాదుకు చెందిన ద్వారకానాథ్, కోశాధికారి బెంగుళూరు చెందిన హరీష్, మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం సంయుక్తంగా భారీ విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మాధవరం రోడ్డులో అభయాంజనేయస్వామి ఎదురుగా పదెకరాల్లో రూ.10 కోట్లతో 270 టన్నుల బరువు, 15 అడుగుల వెడల్పుతో 45 అడుగుల ఎత్తు గల ఏకశిల శ్రీరాముని విగ్రహాన్ని నెలకొల్పారు. ప్రముఖ శిల్పి అశోక్ గుడిధార్ ఇంజనీర్ అభిషేక్ గుడిధార్, సుబ్రహ్మణ్య గుడిధార్ ఆధ్వర్యంలో కర్ణాటక, ఆంధ్రకు చెందిన 20 మంది శిల్పికళాకారులు 2022 నుంచి 2024 వరకు ఏకశిల విగ్రహాన్ని చెక్కారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాముని ఏకశిలా విగ్రహం ఏర్పాటు చేయిస్తున్న పీఠాధిపతి

'రా..కదలిరా' వాయిదా

27 లేదా 28 తేదీల్లో నిర్వహించే అవకాశాలు

పత్తికొండ, జనవరి 20: ఈనెల 25న పత్తికొండలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా..కదిలిరా' కార్యక్రమం వాయిదా పడింది. 22వతేదీ అయోధ్యలో జరిగే రామమందిరం ప్రారంభోత్సవానికి చంద్రబాబునాయుడు వెళ్తున్నారు. దీంతో అయోధ్య నుంచి తిరిగి వచ్చిన వెంటనే పత్తికొండలో నిర్వహించాల్సిన 'రా..కదిలిరా' కార్యక్రమంలో పాల్గొనడం కష్టతరం కావడంతో కార్యక్రమం వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 27 లేక 28 తేదీల్లో బహిరంగసభ జరిగే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

Sunday special ఆదివారం ప్రత్యేకం



అద్భుత ఘట్టంలో ఆయనది చెరగని ముద్ర



అయోధ్య రామ మందిర నిర్మాణంలో కీలక పాత్ర : అయోధ్య రామ మందిరం ఉద్యమానికి ఊపిరి ఊదిన నాయకుల్లో చాలా మంది కాలధర్మం చేసినప్పటికీ వారు అందించిన స్ఫూర్తి, సహకారం మాత్రం మరువలేనిది. రామ కార్యాన్ని పూర్తి చేయడంలో వారు సేవలు ఎనలేనివని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రత్యేకించి అయోధ్య రామమందిర వివాదం 500 ఏళ్ల నుంచి కొనసాగుతున్నప్పటికీ 1990 నుంచి తీవ్ర స్థాయికి చేరుకుంది. 1990 అక్టోబరు 30న జరిగిన మొదటి కరసేవలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో పుల్లారెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఆ తర్వాత 1992 డిసెంబరు 6వ తేదీన జరిగిన రెండో కరసేవలో అగ్రనాయకులతో కలిసి పుల్లారెడ్డి శ్రీరామ జన్మభూమి వేదికపై ఉన్నారు. అప్పటివరకు ఉధృతంగా సాగిన అయోధ్య రామ మందిరం వివాదాన్ని ఒక్కసారిగా కోర్టు కేసులు చుట్టుముట్టాయి. రామాలయ నిర్మాణం అంశం కోర్టు పరిధిలోకి వెళ్లిపోయింది. అయితే అప్పటికే విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కోశాధికారిగా కొనసాగుతున్న పుల్లారెడ్డి సాధ్యమైనంత వరకు తోడ్పాటునందించారు. న్యాయ పోరాటానికి అవసరమైన కోర్టు ఖర్చులను భరించేందుకు ముందుకొచ్చారు. తనకు ఉన్న పరిచయాలతో ఉద్యమానికి అవసరమైన నిధి సేకరణకు కంకణబద్ధులై పని చేశారు.

- అయోధ్య రామమందిరం నిర్మాణంలో విశేష కృషి చేసిన పుల్లారెడ్డి
- ఉద్యమానికి వెన్నంటి ఉంటూ ఆర్థిక చేయూత
- న్యాయ పోరాటానికి సొంతిల్లు, నగలు అమ్మేందుకు వెనకాడని వైనం
- విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ కోశాధికారిగా సేవలు
- నేతి మిఠాయిల వ్యాపారంతో ప్రపంచ ఖ్యాతి
- స్వగ్రామానికి అన్ని విధాలుగా తోడ్పాటు



ఆత్మకూరు, జనవరి 20:

ఐదు శతాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. అనేక వివాదాల నడుమ శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామ మందిర నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మరికొన్ని గంటల్లో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ క్రతువు జరగనుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అంబరాన్ని అంటేలా సంబరాలు జరుగుతున్నాయి. ఇంతటి అద్భుత ఘట్టంలో ఎంతో మంది త్యాగధనుల కృషి ఉంది. అందులో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గోకవరం గ్రామ వాసి, ప్రముఖ మిఠాయిల వ్యాపారవేత్త దివంగత జీ పుల్లారెడ్డి ఒకరు. అందులో ఆయన పాత్ర విశేషంగా చెప్పవచ్చు. 22వ తేదీన అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహం ప్రతిష్ఠ సందర్భంగా పుల్లారెడ్డి గురించి ఆంధ్రజ్యోతి కథనం..

మారుమూల ప్రాంతంలో పుట్టి..

1920 ఆగస్టు 20వ తేదీన గుణంపల్లి హుసేన్‌రెడ్డి, పుల్లమ్మల దంపతులకు పుల్లారెడ్డి జన్మించారు. నిరుపేద వ్యవసాయ కుటుంబం కావడంతో కూలినాలీ చేసుకుంటూ జీవనం సాగించేవారు. మొదట్లో పుల్లారెడ్డి మజ్జిగ, బట్టలు, టీ అమ్మడం వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేశారు. తన చిన్నాన్న కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రోద్బలంతో 1948లో మిఠాయి వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఈయన తయారు చేసే మిఠాయిలకు మంచిపేరు రావడంతో 1957లో హైద్రాబాద్‌లోని అబిడ్స్‌లో చిన్న మిఠాయిల దుకాణాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారు. అంతేగాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జీ పుల్లారెడ్డి మిఠాయిల దుకాణాలను ఏర్పాటు చేసి తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. పలు సందర్భాల్లో హైద్రాబాద్‌కు వచ్చిన విదేశీయులు సైతం ఈయన తయారు చేసిన మిఠాయిల రుచి చూసి ఎంతో ప్రశంసించేవారు. ఇదిలావుంటే తన మిఠాయి దుకాణాల్లో పని చేసే కూలీలను కూడా సొంతింటి మనుషులుగా భావించేవారు. వారందరికీ ఆయన సొంత ఇళ్లను కూడా నిర్మించి సహాయ సహకారాలు అందించిన మంచి మనస్సు గల వ్యక్తిగా పేరు గడించారు.

రామాలయ నిర్మాణం కోసం ఇంటిని అమ్మేందుకు సిద్ధం

అయోధ్య రామ మందిరానికి సంబంధించి ఒకసారి కోర్టు ఖర్చుల నిమిత్తం విశ్వహిందూ పరిషత్ ఢిల్లీ శాఖకు రూ.25 లక్షలు అవసరం ఏర్పడింది. ఆ పరిస్థితుల్లో నిధులను సమీకరించడం కష్టతరం కావడంతో అప్పటి విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ హైదరాబాద్‌కు చేరుకుని జీ పుల్లారెడ్డి ఇంటికి వచ్చి సంప్రదించారు. నిధుల సమీకరణ విషయంపై వారితో ప్రస్తావించారు. వెంటనే రూ.2 లక్షల తీసుకొచ్చి అశోక్‌జీ చేతిలో పెట్టారు. సాయంత్రానికి మరో రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి ఆ మొత్తాన్ని కూడా సమకూర్చారు. మిగిలిన డబ్బును తన మిత్రుల నుంచి సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. రామ జన్మభూమి వివాదం విజయం సాధించే వరకు న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తన ఇంటిని, ఇంట్లో నగలను అమ్మైనా కోర్టు ఖర్చులు ఇస్తానని అన్నారు. ఈయన దాతృత్వానికి ఆయన సతీమణి సైతం అడ్డు చెప్పేవారు కాదు. ఈ విషయాలను పుల్లారెడ్డి మరణాంతరం హైద్రాబాద్‌లో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో అశోక్ సింఘాల్ స్వయంగా వెల్లడించారు. అయితే 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు మందిర నిర్మాణానికి అనుగుణంగా తీర్పు ఇచ్చింది. ఆ సమయానికి పుల్లారెడ్డి లేకపోయినప్పటికీ ఆయన ఆత్మ శాంతిస్తుందని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



జీ.పుల్లారెడ్డి నిర్మించిన ఆసుపత్రి

సంఘ్ పరివార్ సంస్థలకు పెద్ద దిక్కుగా..

విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ స్థాయి బాధ్యతలు చేపడుతూనే సంఘ్ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యానికి జీ పుల్లారెడ్డి పెద్దదిక్కుగా నిలిచేవారు. 1974లో సంఘ్‌చాలక్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏటా జరిగే సంఘ్ శిక్షణా తరగతులు, ఏబీవీపీ అభ్యసన తరగతులు, భజరంగదళ్ శిక్షణా శిబిరాలు, సేవా భారతి, స్వదేశీ జాగరణ సమావేశాలు, బీఎంఎస్ సభలు, సర్వసతీ శిశు మందిర్ ఉపాధ్యాయుల శిక్షణా సమయాల్లో ఆయా శిబిరాలను సందర్శించేవారు. స్వయం సేవలకు స్వయంగా నేతి మిఠాయిలు పంచేవారు. ఈ క్రమంలోనే ఈయనను కిడ్నాప్ చేయాలని కొందరు కుట్ర పన్ని నప్పటికీ ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి ఆయనకు భద్రత కల్పించాయి. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖకు అన్నీ తానై వ్యవహరించేవారు. హైద్రాబాద్‌లోని కోటిలో విశ్వహిందూ పరిషత్‌కు సొంత భవనాన్ని నిర్మించడంతోపాటు అబిడ్స్‌లో ఇస్కాన్ ఆలయానికి స్థల దాతగా నిలిచారు. అంతేగాకుండా సంస్కృత భాషా ప్రచార సమితి అధ్యక్షుడిగా, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పని చేశారు. విద్యాసంస్థలను స్థాపించి తనకంటూ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. అలాగే నిరుపేదల విద్యార్థులను ఎంపిక చేసి తన విద్యా సంస్థల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈయన దాతృత్వాన్ని గుర్తిస్తూ ఉడిపి పెజావర్ స్వామివారు జీ పుల్లారెడ్డిని దానగుణ భూషణ అనే బిరుదుతో సత్కరించారు. 1992లో ఈయన జమ్నాలాల్ బజాజ్ అవార్డు పొందారు. 2007 మే 9వ తేదీన మరణించారు. అయితే ఏనాడు జీ పుల్లారెడ్డి తాను ఆర్జించిన ధనంపై మోహం చూపలేదు. సంపాదించిన దాంట్లో సమాజానికి ఇవ్వాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగారు. ఈయన పెద్దకుమారుడు రాఘవరెడ్డి విశ్వహిందూ పరిషత్‌కు 2011-18 వరకు అంతర్జాతీయ అధ్యక్షుడిగా పని చేశారు.

స్వగ్రామానికి అన్ని విధాలుగా తోడ్పాటు

తాను ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ జన్మభూమిని మరవని మహోన్నత వ్యక్తి పుల్లారెడ్డి. తన ఆశయాలు కొనసాగాలన్న గొప్ప సంకల్పంతో విస్తృతంగా శాశ్వత సేవా కార్యక్రమాలు చేపట్టారు. జీ పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పేరిట తన సతీమణి గుణంపల్లి నారాయణమ్మ జ్ఞాపకార్థం గోకవరం గ్రామంలో 1996లో మూడు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చి 24 గంటల పది పడకల ఆసుపత్రిని నిర్మించారు. ఈ వైద్యశాలలో రూ.10కే ఉచితంగా వైద్యసేవలు, మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామంలోని పంట పొలాలకు సాగు నీరందించాలన్న సంకల్పంతో 530 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఎద్దులేరు వాగుపై చెరువు నిర్మాణానికి ప్రోత్సాహం అందించారు. దీంతో వేలాది ఎకరాల పంట భూములు సస్యశ్యామలం అయ్యాయి. అదేవిధంగా గ్రామంలో సేవా భారతి ఫౌండేషన్ ద్వారా కొనసాగుతున్న భక్త కన్నప్ప గిరిజన ఆశ్రమ పాఠశాలకు మూడు ఎకరాల స్థలంతోపాటు రూ.15 లక్షల వ్యయంతో భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ పాఠశాలలోనే చెంచుగిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 4.70 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడంతోపాటు పాఠశాల భవన నిర్మాణానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా విద్యుత్‌స్టేషన్ ఏర్పాటుకు ఎకరా, గ్రామంలో శివాలయం కోసం ఎకరా, గ్రామంలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటుకు రెండున్న ఎకరాల స్థలాన్ని విరాళంగా అందించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు 25 శాతం ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించేలా రూ.10 లక్షల వ్యయంతో చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. జీ పుల్లారెడ్డి ఇంజనీరింగ్, బీ- ఫార్మసీ కళాశాలల్లో గ్రామానికి చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించి వారు ఉన్నతికి కృషి చేశారు.

అరుదైన అదృష్టం జీ పుల్లారెడ్డిని వరించింది



దేశంలో ఎంతోమంది ధనవంతులు ఉన్నప్పటికీ శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి విశేషమైన కృషి చేసే గొప్ప అదృష్టం జీ పుల్లారెడ్డికి వరించడం మామూలు విషయం కాదు. అట్టడగు స్థాయి నుంచి ఎంతో కష్టపడి ఎదిగి తనవంతుగా రామకార్యంలో అత్యంత కీలకపాత్ర వహించిన జీ పుల్లారెడ్డి ఆత్మకూరు ప్రాంతవాసి కావడంతో మాకందరికీ గర్వకారణం. సేవా కార్యక్రమాల్లో ఆయన ఎంతో స్ఫూర్తి అందించారు. సంపాదించిన సొమ్ములో సమాజానికి ఎంతో కొంత ఖర్చు చేసిన గొప్ప వ్యక్తి. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆయన్ని స్మరించుకోవడం అందరి బాధ్యత.

గరుడాద్రి సత్యనారాయణశర్మ, పట్టణ పురోహితుడు, ఆత్మకూరు.

పుల్లారెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుతాం



అయోధ్య రామమందిరం నిర్మాణంలో చెరగని ముద్ర సొంతం చేసుకున్న జీ పుల్లారెడ్డి స్ఫూర్తితో మేము ముందుకు సాగుతాం. అవసరమైతే రామ మందిరం కోసం సొంతింటిని సైతం అమ్మాలన్న జీ పుల్లారెడ్డి సంకల్పమే నేడు ఇంతటి విజయానికి సోపానంగా నిలిచింది. ఈ మహాకార్యంలో ఆయన లేకపోవడం బాధాకరమే. అయోధ్య రామాలయ నిర్మాణానికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మేము మరువలేదు. పుల్లారెడ్డి స్ఫూర్తితో హిందూ ధార్మిక కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తామని సగర్వంగా తెలియజేస్తున్నాం.

- శివరామకృష్ణ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధి, ఆత్మకూరు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 20: జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కర్నూలు నగరంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 3693 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నగరంలోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల, ఇందిరాగాంధీ హైస్కూల్, ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారా లీగల్ వలంటీర్లకు న్యాయ సదస్సు

కర్నూలు(లీగల్), జనవరి 20: పారా లీగల్ వలంటీర్లు వివిధ చట్టాలపై అవగాహన పెంచుకుని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు కోరారు. న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జరిగిన పారా లీగల్ వలంటీర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు వినియోగదారుల హక్కుల చట్టం, క్రిమినల్ చట్టాలు, సివిల్ చట్టాలతో పాటు ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిర్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. యువకుడి మృతి

మంత్రాలయం, జనవరి 20: మండలంలోని మాధవరం సమీపంలో సెయింట్ మార్థోమా స్కూల్ దగ్గర బైక్ బోల్తా పడి శనివారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. మాధవరం గ్రామానికి చెందిన బోయ విశ్వనాథ్ (25) మోటారు సైకిల్‌పై రాంపురం నుంచి సొంత గ్రామానికి వస్తుండగా అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కిరణ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య పద్మ, కొడుకు అఖిల్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలేరో డివైడర్‌ను ఢీకొని..

కర్నూలు, జనవరి 20: నగరంలోని బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో అస్లాం (22) అనే యువకుడు మృతి చెందాడు. కర్ణాటకకు చెందిన అస్లాం అతని మిత్రులు పవన్ కుమార్‌తో కలిసి కొబ్బెర వ్యాపారం చేస్తుంటారు. బెంగళూరు సమీపంలో ఉన్న తుంకూరు జిల్లాకు చెందిన వీరిద్దరు తమ సొంత బొలేరో వాహనంలో కొబ్బెరతో హైదరాబాదుకు బయలుదేరారు. కర్నూలు వచ్చిన తర్వాత వీరు ప్రయాణిస్తున్న బొలేరో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న అస్లాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఏడాది కొడుకు ఉన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా..?

- అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- పాండురంగాపురం సమీపంలోని వైసీపీ ప్రజాప్రతినిధి వెంచర్‌లో ఘటన

నంద్యాల క్రైం, జనవరి 20 : నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామం సమీపంలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధి వెంచర్‌లో ఓ బాలిక మృతి చెందింది. బాలికను అత్యాచారం చేసి ఆపై హత్య చేసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన యాకోబు, కర్ణ దంపతులు తమ కుమార్తెతో, మరి కొంత మందితో పాండురంగాపురం సమీపంలోని వెంచర్‌లో కూలీపని చేసేందుకు వలస వచ్చారు. పండుగకు బాలిక తల్లిదండ్రులు ఊరికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా బాలిక ఉంటుంది. శుక్రవారం ఉదయం తెలిసిన వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి ఆరుగురు కూలీలకు భోజనం సిద్ధం చేయాలని చెప్పి వెళ్లారు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాలిక ఇంట్లో విగత జీవిగా ఉండటం స్థానికులు గుర్తించారు. ఈ సమాచారంతో మృతురాలి తల్లి దండ్రులు నంద్యాలకు చేరుకున్నారు. బాలిక మృతి అనుమానాస్పదంగా ఉండటంతో విషయాన్ని బయటకు పొక్కకుండా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రి మార్చురీ గదికి తరలించారు. ఘటనపై తల్లిదండ్రులను వివరణ కోరగా.. తమకేమీ తెలియదని, అంతా రెడ్డే చూసుకుంటారని సమాధానం ఇచ్చారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకొని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి నుంచి సరైన మద్దతు రాకపోవడంతో మిన్నకుండిపోయారు. అయితే దళిత సంఘాల నాయకులు బాలస్వామి, లక్ష్మణ్ మాట్లాడుతూ బాలికపై అత్యాచారం చేయడంతోనే మృతి చెందిందని, ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఉరి వేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపించడంలేదని అన్నారు. ఈ సంఘటనపై తాలుకా అర్బన్ సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. బాలిక మృతదేహానికి పోస్టుమార్టం అయ్యేంత వరకు సీఐ, ఎస్ఐ పోస్టుమార్టం గది వద్దనే ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న వాల్మీకులు

కర్నూలు (కలెక్టరేట్)/కల్లూరు, జనవరి 20: ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ శనివారం వాల్మీకి యువ సేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. బీసీవైపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ వాల్మీకి బోయలకు బీసీవైపీ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు. అంతకముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో వినోద్, శేషు, క్రాంతి, కృష్ణుడు, రంగముని, కుబేర స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

నీటిని మళ్లించిన రైతుపై చర్యలు తీసుకోండి

ఎల్లెల్సీ కార్యాలయాన్ని ముట్టడించిన రైతు సంఘం నాయకులు



ఎల్లెల్సీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆదోని రూరల్, జనవరి 20 : ఆదోని మండలం పెద్దతుంబళం ఎల్లెల్సీకి వచ్చే నీటిని మళ్లించుకున్న రైతుపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, లింగన్న డిమాండ్ చేశారు. శనివారం రైతులతో కలిసి ఎల్లెల్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. వారు మాట్లాడుతూ కామవరం సమీపంలోని ఫారెస్టులో పులికనుమ కాల్వ ద్వారా ఎల్లెల్సీకి నీరు ప్రవహిస్తుందని, అయితే అక్కడే ఉన్న ఓ రైతు తన అనుమతి లేకుండా కి.మీ. మేర గుంత తవ్వుకొని ఎల్లెల్సీ ద్వారా ప్రవహించే నీటిని తన పొలానికి మళ్లించుకున్నాడని అన్నారు. దీంతో పెద్ద తుంబళం పొలాలకు నీరందడం లేదని తెలిపారు. తక్షణమే ఈ అక్రమ నీటి వాడకంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో రైతులు జాహేర్, పీరా, మౌలా, నరసన్న, నీలకంఠ పాల్గొన్నారు.

వంద శాతం కుల గణన చేయాలి

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 20 : జిల్లాలో వంద శాతం కుల గణన సర్వే చేయాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా, మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుల గణన సర్వే 3,811 క్లస్టర్లలో సర్వే ఎందుకు ప్రారంభించలేదని అన్నారు. 13 మండలాలలో 50 శాతం కంటే తక్కువ క్లస్టర్లలో కుల గణన సర్వే చేపట్టారని మండిపడ్డారు. కుల గణన సర్వే సిబ్బంది సెలవు దినాల్లో కూడా పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, కమిషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

HOUSE FOR SALE
కొత్తగా, నాణ్యవంతంగా నిర్మించిన ఇల్లు (2BHK) అమ్మకంనకు కలదు. (తిరుమలగిరి - జోన్ రోడ్, కర్నూలు నందు.) Slab Area : 1200 Sft, 30x45 West. Contact : **63043 88820**
AJL-155668

LEASE/ RENT
Maddur Nagar Main Road, Corner 3 BHK Upstaires Renovated Available for Commercial / Residential Purpose Cell: **81214 64409.**
AJL-180086

పొలం అమ్మబడును
జోన్ మండలం, పెద్దమల్కాపురంలో 3 ఎకరాల పొలం అమ్మబడును. కావాల్సినవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : **93982 08838.**
AJL-180253

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656208
AJV_164648

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

CHANGE OF NAME
I, **Syed Khamrunnisa Begum** W/o. **Syed Khasim Peeran** (Old Name) R/o.27-615-1, Moolasagaram, Nandyal-518501, Nandyal Dist, AP., I Have Changed My Name Known As **Bendakayala Khamrunnisa Begum** W/o. **Syed Khasim Peeran** (New Name)
AJL-180136

CHANGE OF NAME
I, **NAIK SHERAJUDDIN** (Old Name) R/o. D.No: 90/3-70-1-1, SRINIVASA NAGAR, NEAR BALAJI NAGAR , KURNOOL of Kurnool dist, AP., hereby declare that I have changed my name as **NAIK SIRAJUDDIN** (New Name) S/o NAIK KHAJA MIAH
AJL-180136

CHANGE OF NAME
I, **NAIK MUMTAZ BEGUM** (Old Name) R/o. D.No:90/3-70-1-1, SRINIVASA NAGAR, NEAR BALAJI NAGAR , KURNOOL of Kurnool dist, AP., hereby declare that I have changed my name as **NAIK MUMTAZ** (New Name) W/o NAIK SIRAJ UDDIN
AJL-180136

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**
AJA- 150698

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆడపిల్లలను రక్షించండి: కలెక్టర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 20: ఆడపిల్లలను రక్షించండి.. చదివించండి అని కలెక్టర్ జి.సృజన ప్రజలకు సూచించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ బాలికా వారోత్సవాలలో భాగంగా ఆడ పిల్లలను రక్షించండి -ఆడపిల్లలను చదివించండి కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ బాలికా వారోత్సవాలను జనవరి 19వ తేదీ నుంచి 24 వరకు నిర్వహిస్తున్నామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, భ్రూణ హత్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, శారద, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.సృజన నగర పాలక సంస్థ కమిషనర్, కర్నూలు అర్బన్, మండల, కల్లూరు తహసీల్దార్లకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ర్యాలీకి వివిధ కళాశాలల నుంచి భారీగా విద్యార్థులను వచ్చే విధంగా యాజమాన్యంతో చర్చించాలన్నారు. మూడు మార్గాల ద్వారా విద్యార్థులను ర్యాలీగా పంపాలని పేర్కొన్నారు. సీ క్యాంపు సెంటర్‌లో కల్లూరు తహసీల్దారు, కొండారెడ్డి బురుజు వద్ద కర్నూలు అర్బన్ తహసీల్దార్, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వద్ద మండల తహసీల్దారు బాధ్యతలు తీసుకుని అందరికీ ప్లకార్డ్స్, స్లోగన్స్‌తో ర్యాలీగా జిల్లా పరిషత్ సమావేశ భవనం వద్దకు చేరాలన్నారు.

రేపు స్పందన

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 20: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు. డివిజన్ స్థాయిలో స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కదులుతున్న ఫేక్ డొంక..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 20: పశు సంవర్థక శాఖలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ఉదంతంపై డొంక కదులుతోంది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. జేడీ రామచంద్రయ్య మాట్లాడుతూ బోగస్ సర్టిఫికెట్లపై విచారణ చేస్తామన్నారు. ఈ విధంగా ఉద్యోగాలు పొందిన వారిని విచారించి అర్హులైన వారికే ఉద్యోగాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆదోని జీజీహెచ్ ఏడీగా శైలజా

కర్నూలు(హాస్పిటల్), జనవరి 20: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ఎ.శైలజాకు ఏడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను కొత్తగా ఏర్పడిన ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి ఏడీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జీజీహెచ్ ఏవోగా ఉన్న ఆమె శనివారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఏడీకి కార్యాలయ ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు ఆదోని జీజీహెచ్ ఏడీగా ఆమె విధుల్లో చేరారు.

కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించిన కలెక్టర్

కర్నూలు(రూరల్), జనవరి 20: కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఆవరణలో నూతన కాన్ఫరెన్స్ హాల్‌ను శనివారం కలెక్టర్ జి.సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయంగా ఉన్న ఈ భవనాన్ని రూ.24లక్షల సొంత నిధులతో ఆధునికీకరణ పనులు చేయించి, కొత్తగా కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మించామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఈ భవనాన్ని పునరుద్ధరించడం వలన అత్యవసర సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్, కర్నూలు ఆర్డీవో సి.హరిప్రసాద్, ఏవో వేణుగోపాల్, కర్నూలు రూరల్, అర్బన్, కల్లూరు తహసీల్దార్లు శివరాముడు, విజయశ్రీ, వెంకటరమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా కిస్తీ వేడుకలు

గూడూరు, జనవరి 20: మండలంలోని పోన్నకల్ అయ్యకొండ మిన్నెల్ల స్వామి ఉరుసులో భాగంగా నిర్వహించిన కిస్తీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్.సుధాకర్ రెడ్డి, స్టేట్ మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎ సలీం స్వామి వారిని దర్శించుకొని ప్రార్థనలు నిర్వహించారు.

'జయహో బీసీ'ని విజయవంతం చేయండి

ఓర్వకల్లు, జనవరి 20: ఓర్వకల్లులో ఈనెల 23న జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు బీసీల సంక్షేమానికి ఈ చట్టాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే తేస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ పాణ్యం, నందికొట్కూరు ఇన్‌చార్జులు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అల్లాబాబు, అబ్దుల్లా, గోపాల్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు, జనవరి 20: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గొల్ల కృష్ణ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన గొల్లకృష్ణ గత కొద్ది కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతు న్నాడు. ఈ నెల 9న చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి వచ్చాడు. 10వ తేదీ రాత్రి ఆసుపత్రి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు అంతటా గాలించి ఎక్కడా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri. Govindu, S/o. Sri. Bheemanna, Resident of H.No.84-93, Shareen Nagar, Kallur, Kurnool.**, by keeping the below mentioned of property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The Property is residential house plot bearing No.17 (Western half), in Sy. No.536 of Kallur, in a colony called " Krishna Priya Nagar", approved vide L.P.No.46/86, with in Sub Registration of fice of Kallur and Dist. Registration office of Kurnool and bounded as follows. **East:** Remaining half of same plot, **West** : Plot No.16, **North:** plot No.12, **South:**60" feet road, **Extent : 122.22** Sq.yards

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కర్నూలు, జనవరి 20: రెండు రోజుల క్రితం పైఅంతస్తు నుంచి కింద పడ్డ నాలుగేళ్ల చిన్నారి షేక్ ముస్కాన్ అనే చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. స్థానిక పాతబస్తీకి చెందిన ముస్కాన్ రెండు రోజుల క్రితం ఇంటిపైన ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడింది. తలకు దెబ్బలు తగలడంతో తండ్రి ఇస్మాయిల్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు చిన్నారి మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఇస్మాయిల్ బీరువాల వ్యాపారం చేస్తుంటాడు.

అంగన్‌వాడీల రాస్తారోకో

కోడుమూరు, జనవరి 20: సమస్యలు పరిష్కరించాలని స్థానిక పాతబస్టాండ్‌లో అంగన్‌వాడీలు శనివారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు గఫూర్ మియా మాట్లాడుతూ 40 రోజులగా అంగన్‌వాడీలు సమ్మె చేపడుతున్న ప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలగడంతో పోలీసులు రంగం లోకి దిగి అంగన్‌వాడీలతో రాస్తారోకో విరమిం పజేశారు. వీరికి సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు వీరన్న, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గూడూరు: తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్ ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అరుణ, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్‌లు మాట్లాడుతూ గత 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ నాయకురాలు ఇందుమతి, అనంతమ్మ, సరోజమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



కోడుమూరులో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

చెత్త పన్ను ఫైట్

» సెక్రటరీ, దుకాణ యజమాని మధ్య ఘర్షణ
» స్టేషన్‌లో పంచాయితీ.. ఆలస్యంగా వెలుగులోకి..

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: నగర పాలక సంస్థ పరిధిలో చెత్త పన్ను కోసం ఓ దుకాణ యజమాని, సచివాలయ సెక్రటరీ కొట్టుకున్నారు. నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పంచాయితీ కూడ జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో కూడ చెత్త పన్ను కట్టలేదని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో దుకాణాన్ని అధికారులు సీజ్ చేసారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న చెత్త పన్నును కట్టేందుకు దుకాణ యజమానులు ముందుకు రాకపోవడంతో అధికారులు సెక్రటరీలపై ఒత్తిడి పెంచారు. ఎలాగైనా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలనే ఉద్దేశంతో సెక్రటరీలు పని చేయడంతో ఈ ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. 16వ డివిజన్ పరిధిలో 36వ వార్డు కోడుమూరు రోడ్డు రాజీవ్ గృహకల్ప వద్ద ఏ చాయ్ దుకాణం ఉంది. యజమాని దుకాణం ఏర్పాటు చేసినప్పటి నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోలేదు..దీంతో పాటు చెత్త పన్నుల కూడ కట్టలేదు. ఈ క్రమంలో సచివాలయ సెక్రటరీ దుకాణ యజమానికి నోటీసులు ఇచ్చాడు. అయినప్పటికీ చెత్త పన్ను చెల్లించకుండా, ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండా యజమాని ఉండటంతో పలుమార్లు సెక్రటరీ యజమానిపై అసహనం వ్యక్తం చేసారు...

● **వారం రోజుల క్రితం ఘర్షణ:** వారం రోజుల క్రితం సెక్రటరీ దుకాణం నుంచి ఎలాగైనా ట్రేడ్ లైసెన్సు, చెత్త పన్ను వసూలు చేయాలని యజమానితో దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో యజమాని మళ్లీ వస్తే పన్ను కడతానని చెప్పి పంపించాడు. ఆ తర్వాత వచ్చిన సెక్రటరీకి, యజమానికి వాగ్వాదం జరిగింది. యజమాని తన స్నేహితులకు సమాచారం ఇచ్చి అక్కడికి రమ్మని కబురు పంపారు. సెక్రటరీ రావడంతోనే యజమాని అతనిపై దురుసుగా వ్యవహరించాడు. సెక్రటరీ కూడ అదే పద్ధతిలో స్పందించాడు. పక్కనే ఉన్న యజమాని స్నేహితులు ఒక్కసారిగా సెక్రటరీపై దాడికి పాల్పడ్డారు.

● **పోలీస్ స్టేషన్‌లో పంచాయితీ :** ఈ విషయంపై నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు చేసారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు సమక్షంలో ఎస్ఐ స్టేషన్‌లో ఇద్దరిని పిలిపించి పంచాయితీ చేసారు. అయితే సెక్రటరీపై దాడి చేసిన వారిని ఏమి అనకుండా పోలీసులు కేసును వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. దుకాణ యజమానికి ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసినా శిక్షించకుండా వదిలిపెట్టారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇలా ఉంటే చెత్త పన్ను వసూలు కో సం వెళ్లి రోజూ తన్నులు తినిరావాల్సిందేనా అని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

పంచలింగాల చెక్‌పోస్టు తనిఖీ



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు, జనవరి 20: నగర శివారులో ఉన్న పంచలింగాల చెక్‌పోస్టును ఎస్పీ కృష్ణకాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బార్డర్ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల చెక్‌పోస్టుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం, డబ్బును తరలించే వాహనాలను గుర్తించాలన్నారు. సీసీ కెమెరాలు, తగినంత సిబ్బందిని నియమించుకుని నిరంతరం మానిటరింగ్ చేస్తుండాలని సూచించారు. 24 గంటలు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ వెంట అడిషినల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, సీఐలు శ్రీనివాసరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, సెబ్ ఏఈఎస్ రాజశేఖర్ గౌడు ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 20: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూ రిటీ సిబ్బందిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మార్చుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరీ హాలులో సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లతో ఆయన సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసు పత్రిలో రోగులకు సహాయకులుగా కొంత మంది సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది డ్యూటీ రోస్టర్ వేయాలని సీఎస్ఆర్ఎంవోను సూపరింటెండెంట్ ఆదేశించారు. ఎంఎన్‌వోలు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ ఏజెన్సీలను సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది ఎవరైనా విధులకు సరిగ్గా పని చేయని యెడల వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ఎవరూ సరిగ్గా పని చేయడంలేదని, ఇష్టానుసారంగా లీవులు ఇస్తున్నారని సూపరింటెండెంట్ మండిపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకరమణ, హాస్పిటల్ అడ్మిని స్ట్రేటర్లు శివబాల, కిరణ్‌కుమార్, సునీల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించాలి



మెప్మా పీడీకి వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: పొదుపు మహిళల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి అలివేలు డిమాండ్ చేశారు. శనివారం మెప్మా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అలివేలు మాట్లాడుతూ బ్యాంకులలో పొదుపు మహిళలకు రుణాలు వచ్చిన ప్రతిసారి రూ.8 నుంచి రూ.10 వేల వరకు సర్‌చార్జీలు, ఆడిట్ పేరుతో డిపాజిట్ చేయించుకోవడం దారుణమన్నారు. సొంత పొదుపు అకౌంట్ నుంచి డబ్బులు అత్యవసరాలకు డ్రా చేసుకోనివ్వడం లేదన్నారు. అభయ హ స్తం కట్టిన సభ్యులకు ఇప్పటి వరకు పెన్షన్, స్కాలర్‌షిప్ రావడం లేదన్నారు. శ్రీనిధి పేరుతో లక్షల రూపాయలు డిపాజిట్ కింద పెట్టుకుని మహిళలకు రుణాలు ఇవ్వకుండా బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు జే కిరణ్మయి, పర్వీన్, మాధురి పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

గూడూరు, జనవరి 20: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ కోడుమూరు నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు గూడూరు, పొన్నకల్లు గ్రామాల్లో బొగ్గుల దస్తగిరి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అంతకుముందు మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో బొగ్గుల దస్తగిరి పాల్గొని స్థానిక బస్టాండు ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగులాపురం సురేష్, సృజన్, పౌలు, దానమయ్య, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, జులకల్ సత్తిరెడ్డి, తెలుగు శ్రీనివాసులు, విజయ్, పెద్ద చాంద్‌బాషా, ఆదామ్, మధుసూదన్, విష్ణుసేన సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేద్దాం

కర్నూలు(అర్బన్): రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకునేందుకు వీరశైవులంతా కలిసికట్టుగా కృషి చేయాలని వీరశైవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు శివరాజు పిలుపునిచ్చారు. నగరంలోని అశోక్ నగర్ పాతకొట్టాలు, సీతారామ్ నగర్, రామలింగేశ్వరనగర్‌లలో ఇంటింటికీ తిరిగి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ ఐక్యవేదిక అధ్యక్షుడు మల్లికార్జునప్ప, నాయకులు చంద్రశేఖరప్ప, విజయ్, శంకరయ్య, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, ఆదిగౌడ్ పాల్గొన్నారు.



గూడూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బొగ్గుల దస్తగిరి



కర్నూలు నగరంలో..

కళ్లకు గంతలతో క్లాప్ డ్రైవర్ల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె శనివారానికి 35వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు చలనం కూడా రాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దు ల్‌దేశాయ్, డి.కుమార్, రఘుశేఖర్, నరేష్, నవీన్, బాబ్జి, పరమేష్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: నగరంలో దోమలను నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల నగరంలో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు శనివారం యాంటిలైరల్ ఆపరేషన్‌లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వినాయక ఘాట్ నుంచి జోహరాపురం వరకు కేసి కెనాల్‌లో నీరు నిల్వ ఉన్న చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఆ యిల్ బాల్స్, బీటీ లిక్విడ్ వేశారు. స్వామిరెడ్డినగర్, గ్రీన్‌పార్కు, అయ్యప్పస్వామి ఆలయం, దేవనగర్, పాలకొట్టాల, తదితర ప్రాంతాలలో ఆయిల్‌బాల్స్ వేసారు. మధ్యాహ్నం, సాయంత్ర వేళల్లో డ్రైనేజీ, వార్డులలో ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి వార్డులోని ఒక ప్రాంతంలో తప్పకుండా ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. స్టాంటాన్‌పురం, శరీన్ నగర్‌లోని పాఠశాల విద్యార్థులకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు.

వాటర్‌ట్యాంకు నిర్మాణంలో నాణ్యత పాటించండి

సల్కాపురంలో కాంట్రాక్టర్‌పై గొడవకు దిగిన గ్రామస్థులు

కల్లూరు, జనవరి 20: వాటర్ ట్యాంక్ నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్థులు గొడవకు దిగిన సంఘటన శనివారం కల్లూరు మండలం సల్కాపురంలో చోటు చేసుకుంది. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు దాదాపు రూ.42లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకు నిర్మాణం జరుగుతుంది. టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పిల్లర్స్ దశలో నిర్మాణం పనులు చేపడుతున్నారు. అయితే కాంక్రీట్ పిల్లర్స్ కు వాటర్ క్యూరింగ్ చేయడం లేదని ప్రజలు కాంట్రాక్టర్‌తో గొడవకు దిగినట్లు తెలిసింది. సల్కాపురం ఇంజనీరింగ్ అసిస్టెంట్ అక్కడకు చేరుకుని ప్రజలకు సర్ది చెప్పినట్లు సమాచారం.



ట్యాంకు పిల్లర్లకు వాటర్ క్యూరింగ్ చేయడం లేదని వాదనకు దిగిన గ్రామస్థులు

అక్రమ నిర్మాణాల తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 20: సంతోష్‌నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు శనివారం సిబ్బందితో తొలగించారు. అధికారుల అనుమతి తీసుకోకుండా భవనంలో అదనంగా అం తస్తును నిర్మించడంతో తొలగించినట్లు ఇన్‌చార్జి సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ తెలిపారు. నగరంలో నూతనంగా నిర్మించే భవనానికి తప్పకుండా నగర పాలక సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్ పాల్గొన్నారు.

రేపు శ్రీరాముని పట్టాభిషేకం

కర్నూలు(కల్చరల్), జనవరి 20: అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నగరంలోని కొత్తపేటలో గల పురాతన శ్రీరామాలయంలో శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మల్లికార్జున రెడ్డి, పద్మావతి తెలిపారు. కర్నూలు కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు శ్రీసీతారాములకు అభిషేకం, సహస్ర నామార్చన, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని తెలిపారు. అనం తరం శ్రీరామ పట్టాభిషేకం ఉంటుందని వారు తెలిపారు.

జనఔషధ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్, జనవరి 20: జనఔషధ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సొసైటీ కాంప్లెక్స్‌లో ఉన్న జన ఔషధ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాటా ్లడుతూ మండల కేంద్రంలోని జనఔషధ కేంద్రంలో పేదలకు మందులు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. సమావేశంలో డైరెక్టర్లు, రైతులు, సెక్రెటరీ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు: ఏవో

సి.బెళగల్, జనవరి 20: కంది పంటను సాగు చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల గ్రామాలలో రైతులు సాగు చేసిన కందిపంటను పరిశీలించి, నూర్పిడి చేస్తున్న కందుల రకాన్ని పరిశీలించారు. ఏవో వెంట ఎంఈవోలు భరత్, సిద్దు, వెంకటేశ్వర్లు రైతులు ఉన్నారు.

132 కేవీ ఆధునికీకరణ పనులు పూర్తి

కల్లూరు, జనవరి 20: కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని సబ్‌స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో 132 కేవీ బస్సు ఆధునీకరణ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. శనివారం ఏపీ ట్రాన్స్‌కో సీఈ సి.మోహన్‌రావు, ట్రాన్స్‌కో(ఓఅండ్ఎం) ఎస్ఈ. కృష్ణకుమార్, ట్రాన్స్‌కో (టీఎల్‌సీ)ఎస్ఈ. రామ కృష్ణ, ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి విద్యుత్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. వీరి వెంట డీఈ సుభాష్‌గౌడ్, ఏడీఈ నాగేంద్ర ఉన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

కర్నూలు(లీగల్), జనవరి 20: జిల్లా యోగి వేమన భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక టౌన్ మోడల్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు, న్యాయవాది రంగ రవికుమార్ మాట్లాడుతూ యోగి వేమన తెలుగు భాషా భివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఆర్.వెంగన్న చౌదరి, రిటైర్డ్ ఏఎస్‌పీ వరప్రసాదరావు, రిటైర్డు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణారెడ్డి, న్యాయవాదులు మురళీధర్, వైస్ ప్రెసిడెంటు హెచ్. రామలింగప్ప పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రంగ రవికుమార్

నోరు అదుపులో పెట్టుకో..

కొడాలి నానికి సోమిశెట్టి హెచ్చరిక



కర్నూలు(అర్బన్), జనవరి 20: కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకో.. చంద్రబాబును విమర్శించే స్థాయి నీది కాదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుడివాడలో రా..కదిలి రా.. సభలో చంద్రబాబు బహిరంగకు వచ్చిన ప్రజలను చూసి కొడాలి నాని మతిస్థిమితం కోల్పోయి .. అవాక్కులు.. చెవాక్కులు పేలడాన్ని బట్టి చూస్తే వాడికి పిచ్చి బాగా ముందిరి పరాకాష్ఠకు చేరిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రధాని పదవీని అధిష్ఠించాలని కోరినా రాష్ట్రం కోసం ఆనాడు ఆ పదవిని వదుకులున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌ల గురించి విమర్శిస్తే తాము ఊరుకోమని హెచ్చరించారు.


రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న వెంకట శివనారాయణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 20: రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకటశివ నారాయణ అన్నారు. శనివారం నగరంలోని టీజే షాపింగ్ కాంప్లెక్స్‌కి ఎదురుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ జెండా ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఉచితాలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను సోమరులుగా మారుస్తున్నారని అన్నారు. కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, ఓబీసీ ప్రధాన కార్యదర్శి మురళి నాయుడు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గీతామాధురి, జిల్లా మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వాడకంపై అవగాహన



మాట్లాడుతున్న మువ్వా రామలింగం

కర్నూలు (ఎడ్యుకేషన్), జనవరి 20: ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ట్యాబ్‌ల వాడకంపై అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. శనివారం స్థానిక ఏల్కూరి బంగ్లాలోని నారాయణ పాఠశాలలో ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రాంపై ఉప విద్యాశాఖ అధికారులకు, మండల విద్యాశాఖ అధికారులకు, డీఈవో రంగారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రాం మొదలవుతుందన్నారు. ఇంజనీరింగ్‌లో బీటెక్ చివరి ఏడాది చదివే విద్యార్థులను ఎంపిక చేసి మూడు పాఠశాలలకు ఒకరిని నియమిస్తారని అన్నారు. కోఆర్డినేటర్లకు రూ.12 వేల గౌరవ వేతనం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఏడీ శ్యామేల్ పాల్, ఉప విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాలపై వైసీపీ పెత్తనం సరికాదు

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి


అర్లబండ మఠం పీఠాధిపతితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోసిగి, జనవరి 20: అర్లబండ గ్రామంలో వెలసిన వెంకవధూత అంబాదేవి శాంభవీదేవి మఠంపై గ్రామ వైసీపీ నాయకులు పెత్తనం సరికాదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సీనియర్ నాయకుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ఆర్లబండ మఠంపై వైసీపీ పెత్తనం అన్న కథనంతో వారు మఠాన్ని సందర్శించి పీఠాధిపతి మర్రిస్వామి తాతతో సమావేశమయ్యారు. ముందుగా శాంభవీదేవిని దర్శించుకున్నారు. అనంతరం ముత్తురెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మఠం పీఠాధిపతి ఆదేశాలను లెక్కచేయకుండా రథశాల తలుపులు తీసి రథాన్ని బయటకు తీశారని, అధికార హంకారంతో దేవాలయాలపై పెత్తనం చెలాయించడం చాలా దారుణమని అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు చర్చించి గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ నెల 25న రథోత్సవం జరగాల్సి ఉండగా.. వైసీపీ నాయకుల తీరుపై మఠం పీఠాధిపతి దూరంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసన్న, లక్ష్మిరెడ్డి, రామాంజనేయులు, అయ్యప్ప, సిద్ధప్ప, హనుమేష్, ఫక్కీరయ్య, మఠం పెద్దలు ఉన్నారు.

ఆదోని జీజీహెచ్ ఏడీగా శైలజ

కర్నూలు(హస్పిటల్), జనవరి 20: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ఎశైలజకు ఏడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను కొత్తగా ఏర్పడిన ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి ఏడీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జీజీహెచ్ ఏవోగా ఉన్న ఆమె శనివారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఏడీకి సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు ఆదోని జీజీహెచ్ ఏడీగా ఆమె విధుల్లో చేరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఆదోని టౌన్, జనవరి 20: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపినాథ్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్థానిక డాక్టర్లు, లయన్స్ క్లబ్ సంయుక్తంగా 34 మంది టీబీ వ్యాధిగ్రస్థులకు 6వ విడతగా రూ.1000 ఖరీదు చేసే పౌష్టిక ఆహార కిట్లను పంపిణీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్థులు మందులతోపాటు వ్యాయామం, నడకను అలవర్చుకోవాలని సూచించారు. దాతలకు భారత ప్రభుత్వం వారి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆదోని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వాణిశ్రీ, డాక్టర్లు బాల మురళీకృష్ణ, గోపినాథ్, కృష్ణమూర్తి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, ఓం ప్రకాష్, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు అందించలేని ఎమ్మెల్యే

ఆదోని రూరల్, జనవరి 20: గడప గడపకు వచ్చి ప్రజల అన్ని సమస్యలను తీరుస్తానన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కనీసం తాగునీటిని అందించలేక పోతున్నాడని జనసేన మండల అధ్యక్షులు తాహేర్ వలి అన్నారు. ఆదోని మండలం చాగి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తీర్చాలని జనసేన మండల అధ్యక్షులు తాహేర్ వలి అధికారులను కోరారు. జనసేన ఆధ్వర్యంలో వారు శనివారం చాగిలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యప్ప, అజయ్, రాముడు, రహీమ్, రాము, వెంకట రాముడు, వీరేష్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Chakali Ranganath, S/o. Chakali Gopal, R/o. H.No: 5/74, Shabashpuram Village & Post, Channampalle Mazara, Tuggali Mdl, Kurnool Dt.,** by keeping the below mentioned property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House bearing D.No: 5/74/1a, Sy.No: 35/1B, in Shabashpuram Village, Chennampalle Mazara, Thuggali Mdl, within the limits of Peapully Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** Open site of Talari Devanna, **West :** House of Chakali Gopal, **North:** Rastha, **South:** House of Yadiki Hanumanthu. **Measurements :** East to West 20 feet or 6.093 meters, North to South 42 feet or 12.796 meters. **Total Extent : 840** Sq. feet or **93.33** Sq.Yards. or **78.035** Sq.meters. **Built Measurements :** East to West 20 feet or 6.093 meters, North to South 22 feet or 6.702 meters. **Total Built Area : 440** Sq.feet or **40.875** Sq.meters.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

జనసేనలో చేరిక

పత్తికొండటౌన్, జనవరి 20: పత్తికొండ పట్టణంలో శనివారం క్రిష్ణగిరి మండల అలీవేలి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బోయ రామలింగ, బోయ కుమార్‌నాయుడు, మహేంద్ర, కృష్ణ, మునిస్వామిలతో పాటు 10 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన నియోజకర్గనాయకులు రాజశేఖర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కార్యకర్తలకు తీరని అన్యాయం జరిగిందని, అలీవేలి గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని అందుకే ఆ పార్టీని వీడామని వాపోయారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభమయిందని, టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమని పేర్కొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Manke Varalakshmi, W/o. Manke Lakshmanna, R/o. H.No: 3/22/B, Marella Village, Thuggali Mdl, Kurnool Dt.,** by keeping the below mentioned property of her as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House covered with Zink Sheets, bearing H.No: 3/22/B in Sy.No: 516/2 Pyki, in Marella Village Panchyath, Mukkella revenue, Thuggali Mdl, within the limits of Pattikonda Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** Road, **West :** House of Purushottam, **North:** House of M.Purushottam, **South:** House of Jaya Rangaiah. **Measurements :** East to West 30 feet or 9.11 meters, North to South 33 feet or 10.03 meters. **Total Extent : 110** Sq.Yards. **Built Measurements :** East to West 30 feet or 9.11 meters, North to South 33 feet or 10.03 meters. **Total Built Area : 990** Sq.feet.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

ఈ దుర్గంధం భరించలేం

దేవనకొండ, జనవరి 20: దేవనకొండలోని సినిమాటాకీస్ వెనుక వైపు ఉన్న కాలనీలో మురుగునీరు దుర్గంధం ఊపిరాడనీయడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలువ నిర్మాణం కోసం రెండు నెలల కిందట గుంతలు తవ్వి వదిలేయడంతో నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Shaik Nazeer Basha, S/o. Nemakallu Kasim Saheb, R/o. Ramalingayapalle Village, Channampalle Mazara & Post, Tuggali Mdl, Kurnool Dt.,** by keeping the below mentioned property of his as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Hut, bearing D.No: 15/83/B1, Block No: 15, Patapeta, Pattikonda Village Panchyath, within the limits of Pattikonda Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** House of Katike Narusoji Rao, **West :** Road, **North:** Rastha, **South:** House of Medam Nettekantaiah. **Measurements :** East to West 15 feet or 4.57 meters, North to South 36 3/4 feet or 12.55 meters. **Total Extent : 551.25** Sq.feet. or 61.25 Sq.Yards. **Built Measurements :** East to West 13 feet or 2.91 meters, North to South 23 feet or 7.26 meters. **Total Built Area : 310.5** Sq.feet.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 20: మహిళలు ఆర్థికంగా రాణించాలని మల్లెల గ్రూప్ చైర్మన్ ఆల్ఫ్రెడ్ రాజు, సిస్టర్ సెల్వరాణి అన్నారు. శనివారం పట్టణంలోని మహిళా వికాస్ కేంద్రంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. న్యాయవాది ఎల్కే సుందర్ సింగ్ మాట్లాడుతూ మహిళలు చట్టా లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎల్‌కే చిన్నప్ప, సిస్టర్ సుజన, భారతమ్మ, సంధ్యారాణి సంతోష్ పాల్గొన్నా రు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మద్దికెర, జనవరి 20: మండలంలో రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ఉప్పరి రవి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో ఈకేవైసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాటాడుతూ ఈకేవైసీ చేయించుకోవడం వల్ల రబీలో సాగు చేసిన పంటలకు పరిహారం అందే అవకాశం ఉందని సూచించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, జనవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె గ్రామాలలో శనివారం 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఒంటెడుదిన్నె గ్రామంలో బస చేసారు. అంతకు ముందు ఆయా గ్రామలలో టీడీపీ జెండాను ఎగువేశారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలు, పథకాల గురించి అవగాహన కల్పించారు. బీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ తప్పులను, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. నవరత్నాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని అన్నారు. నిత్యావసరాలు, వివిధ పన్నులు అమలు చేయడం, చార్జీలు పెంచడంతో సామాన్యుడి భారం పడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ. 1500 అందిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, తిరుపతయ్యనా యుడు, పిల్లిగుండ్ల జయపాల్, రాముడు, తిప్పారెడ్డి, శ్రీనివాసులు, రఫీక్, రమేష్ ఆచారి, శివన్న, నూరహ్మద్, భారతం రహంతుల్లా, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

రేపు అయోధ్య రాములవారి శోభా యాత్ర

ఆదోని టౌన్, జనవరి 20: అయోధ్యలో ఈనెల 22న జరిగే బాలరాముల వారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఆదోని పట్టణంలో వీహెచ్‌పీ నగర కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రాముల వారి శోభా యాత్ర నిర్వహించ నున్నట్లు పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్ తెలిపారు. శనివారం వీహెచ్‌పీ కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ ఈ శోభా యాత్రలో అన్ని కులసంఘాల పెద్దలు, అయ్యప్ప, శివ, భవాని, ఆంజనేయస్వామి దీక్ష చేపట్టిన స్వాములు పాల్గొనాలని కోరారు. వీహెచ్‌పీ నాయకులు ఈరన్న రావు, అంజనేయలు, చెన్న బసప్ప, వర్మ, రాముడు, నీలకంఠ పాల్గొన్నారు.

ఆలూరు: అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న ఆలూరు పట్టణంలోని రామాలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శంకర్ రెడ్డి, సలకొండ రాము, రవి కుమార్ శనివారం తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం వీధుల్లో సీతారాముల విగ్రహాలను ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

వెల్దుర్తి: పట్టణంలో శ్రీరాముల దేవాలయంలో సోమవారం ఉత్సవ మూర్తుల గ్రామోత్సం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఈ వేడుక నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

వేతనాలు పెంచే వరకు ఉద్యమిస్తాం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 20: అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచేవరకు ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గోవర్ధనమ్మ, శైలజ, నీరజ, తులసి, గాయత్రి, లత అన్నారు. శనివారం శివ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాచ్యుటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ప్రజా సంఘాల నాయకులు రామాంజినేయులు, రాముడు, గోవిందు, ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్దుల్లా, సురేష్, క్రిష్ణ, రాజు, నాగరాజు, ఇస్మాయిల్, మహేశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆదోని: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదోనిలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 40వ రోజుకి చేరింది. ఆదోని పత్తికొండ బైపాస్ రోడ్డులో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అజయ్‌బాబు, ఓబీ నాగరాజు, ఈరన్న, మహానంద రెడ్డి, గోపాల్‌లు మాట్లాడారు. నాయకులు తిప్పన్న, వరలక్ష్మి, జానకి, సరోజ, మీనాకుమారి, రేణుక, ఉమా, శారద, శాంతమ్మ పాల్గొన్నారు.



ఆదోనిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

పత్తికొండటౌన్: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాశీవిశ్వనాథ్, గోపాల్, సీపీఎం నాయకులు రంగారెడ్డి, సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 40వ రోజులకు చేరుకున్న సందర్భంగా దీక్షా శిబిరం నుంచి నాలుగు స్థంబాల కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగుస్థంబాల కూడలి ప్రధాన రహదారిని దిగ్బంధం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పద్మజ, షాజాహన్, మాధురి పాల్గొన్నారు.

మంత్రాలయం: సీఎం జగన్ అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు విశాలాక్షి, భీమేశ్వరి, ఫాతిమా, లావణ్యలు హెచ్చరించారు. శనివారం 40వ రోజు మంత్రాలయం ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయరాజు, అంజిరాజు, అనిత, నరసమ్మ, తులశమ్మ, మాధురి, సుజాత, రజియా, రుఖియా, మీనాక్షి పాల్గొన్నారు.

వెల్దుర్తి: పాతబస్టాండ్ కూడలిలో అంగన్వాడీ వర్కర్లు మానవహారం ఏర్పడి జీతాలు పెంచాలని నినాదాలు చేస్తూ రాస్తారోకో చేశారు. శనివారానికి దీక్షలు 40వ రోజుకు చేరుకోవడంతో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన అంగన్వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని నిరసన శిబిరం నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, చిన్న వ్యాపారుల సంఘం నాయకులు రామాంజనేయులు సంఘీభావం ప్రకటించారు.

దేవనకొండ: అంగన్‌వాడీ టీచర్లపై ఎస్మా చట్టం ప్రయోగించడం సరికాదని సీపీఐ నాయకులు మద్దిలేటిశెట్టి , ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నర్సారావ్ అన్నారు. స్థానిక తహ సీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయకులు ప్రసాద్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు


వెల్దుర్తిలో 40 సంఖ్య ఆకారంలో కూర్చొని అంగన్‌వాడీల రాస్తారోకో

అక్రమ కట్టడాల కూల్చివేత


ఎక్స్‌కవేటర్‌తో అక్రమ కట్టడాలను కూల్చి వేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్, జనవరి 20: మునిసిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు పట్టణంలో శనివారం అక్రమ కట్టడాలను కూల్చివేశారు నిర్మల్ టాకీస్ పక్కన ఉన్న డీఎస్‌పీ బంగ్లా రోడ్డులో డీవైడర్ నిర్మాణానికి అడ్డు వస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు గుర్తించారు మునిసిపాలిటీకి సంబంధించిన స్థలంలో వీటీని అనధికారికంగా నిర్మించినట్లు నిర్ధారించుకొన్న అధికారులు, వాటిని కూల్చివేశారు. విస్తరణలో భాగంగా ఇళ్లను కోల్పోయిన వారికి జగనన్న కాలనీలో ప్లాటును కేటాయించేలా స్థానిక కౌన్సిలర్ లక్ష్మీదేవి సూచించడంతో అధికారులు అంగీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివా సులు, సచివాలయ సిబ్బంది సోమన్న, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా మేనిఫెస్టో కన్వీనర్‌గా నాగరాజు గౌడ్

ఆదోని టౌన్, జనవరి 20: బీజేపీ కర్నూలు పార్లమెంట్ మేనిఫెస్టో కన్వీనర్‌గా ఆదోని అసెంబ్లీ పార్టీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్‌ను నియమిస్తూ పార్లమెంట్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట శివనారాయణ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ గతంలో మేనిపెస్టోలను ప్రకటించిన పార్టీలు వాటిని అమలు చేయకుండా, పశ్చిమ ప్రాంత వాసులను తీవ్రంగా అన్యాయానికి గురిచేశారని ఆరోపించారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'బీసీవై పార్టీతో అభివృద్ధి'

తుగ్గలి, జనవరి 20: బీసీవై పార్టీ వారి యువత అభివృద్ధికి పాటుపడుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని జొన్నగిరిలో యువకులతో ఆయన మాట్లాడుతూ బీసీవై పార్టీ పేదల పార్టీ అని, బీసీల ఎదుగుదల కోసం పాటుపడుతుందని అన్నారు. ఈ నెల 24న యువతతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.


నేడు వైద్య శిబిరం

పత్తికొండ టౌన్, జనవరి 20: పత్తికొండ పట్టణంలో కంటి, గుండె, కిడ్నీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఈ నెల 21న స్థానిక సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్, రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సారథ్యంలో శాంతిరామ్ ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 2గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

మద్దికెర, జనవరి 20: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఎర్రగుడి గ్రామంలో అక్షింతలు పంపిణీ చేశారు. సర్పంచు బురుజుల విజేయుడు, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, టీడీపీ నాయకులు రాఘవేంద్ర, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, రేవప్ప పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని టౌన్, జనవరి 20: ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా)తోపాటు మహిళా విభాగ్ వారి ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సరానికి సంబంధించిన పంచాంగ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కాలమాన పట్టిక ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా రూపొందించామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్, గుప్తా, శ్రీధర్ తెలి పారు. కార్యక్రమంలో రఘు, ఈరన్న శెట్టి, పీ రాము, వెంకటేష్ పాల్గొన్నారు.

'అల్లర్లు సృష్టిస్తే చర్యలు'


మాట్లాడుతున్న సీఐ ఎరిషావలి

మంత్రాలయం, జనవరి 20: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని మంత్రాలయం సీఐ ఎరిషావలి హెచ్చరించారు. శనివారం రాత్రి మండలంలోని బూదూరు గ్రామంలో మంత్రాలయం ఎస్ఐ వేణు గోపాల్‌రాజు అధ్యక్షతన చట్టాలపై సదస్సును ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా జీవించాలమని సూచించారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సవాసప్ప స్వామి ఉరుసు

తుగ్గలి, జనవరి 20: హాజరత్ సయ్యద్‌షా సవాసప్ప స్వామి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో కోటలోని సవాసప్ప స్వామికి హిందూ ముస్లింలు ఐక్యంగా దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు వారి కోర్కెల మేరకు కానుకలు సమర్పించారు. కర్ణాటక, తెలంగాణా, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

మద్దికెర, జనవరి 20: పెరవలిలోని శ్రీరంగనాథస్వామి దేవాలయ రాజగోపురం ముందు భాగంలో శ్రీరామచంద్రమూర్తి, అంజనేయస్వామి విగ్రహాల శనివారం ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దివంగత పారా రామన్న కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న) సహకారంతో ఇచ్చిన విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పురోహితులు విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసి ప్రతిష్ఠించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

మద్దికెర, జనవరి 20: మండలంలో ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో నరసింహమూర్తి తెలిపారు. శనివారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. మండలంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కులగణనకు సర్వే చేస్తున్నారని, ఆసర్వేలో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు.

గోనెగండ్ల: గ్రామాలలో కులగణన ఈ నెల 28లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని గోనెగండ్ల మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో సతీష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటికి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వెళ్లి కులగణన చేపడతారని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రమాదకర ప్రయాణం


వరికోత మిషన్ టాప్‌పై కూర్చున్న కూలీలు

గోనెగండ్ల, జనవరి 20: కూలీలు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. శనివారం గోనెగండ్లలో వరికోత మిషన్ పైభాగంలో దాదాపు 16 మంది డ్రైవర్ పై బాగాన ఉన్న చిన్నపాటి కడ్డీలో మరో ఆరుగురు మొత్తం 21 మంది కూర్చొని ప్రయాణించారు. నిత్యం రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అయితే ఇలాంటి ప్రయాణాలను అధికారులు అరికట్టాలని కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


కర్ణాటక మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ

ఆదోని రూరల్, జనవరి 20: ఆదోని పట్టణానికి చెందిన రామయ్య, చిన్నను ఇస్పీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరివురు కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఇస్పీ ఎస్ఐ శ్రీనివా సులు సిబ్బందితో కలిసి శనివారం మదిరె క్రాస్ వద్ద దాడులు నిర్వహించి దాదాపు 2,112 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివ నారాయణ స్వామి, రూరల్ సీఐ నీరంజ న్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

ఆదోని: ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు మహిళలను సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదోని పట్టణానికి చెందిన బోయ మానస, బోయ వీరేశమ్మలు తమ సంచులలో చెరో 06 బాక్సుల కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తుండగా గుర్తించి సెబ్ సీఐ హరికృష్ణ దాడి వారిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఈ దాడుల్లో సీఐ హరికృష్ణ, ఎస్ఐ మధుసుదన్ రెడ్డి, ముని, రోహిన్, సుధాకర్, విద్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే హాలహర్వి అభివృద్ధి'

నందవరం, జనవరి 20: టీడీపీ హయాంలోనే హాలహర్వి అభివృద్ధి జరిగిందని, తన తండ్రి దివంగంత మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి సహకారంతో ప్రతి ఒక్కరికీ న్యాయం చేశామని టీడీపీ నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమపై వైసీపీ నాయకులు బురద జల్లే రాజకీయం చేస్తున్నారన్నారు. హలహర్విలో తమ సొంత స్థలం సర్వే నెంబరు 278లో 16 ఎకరాలు బీసీలకు ఇచ్చామని, ఆ ప్రాంతానికి బీవీ మోహన్‌రెడ్డి కాలనీ పేరు పెట్టామని చెప్పారు. అయితే ఆ పొలం ద్వారా సొమ్ము చేసుకున్నారని వైసీపీ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. అలాగే గ్రామానికి చెందిన బసవరాజుగౌడు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.10 లక్షలు వచ్చేలా చేసి ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, తన తండ్రి నరసింహారెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. హాలహర్వి నుంచి బాపురం గ్రామానికి రోడ్డు కోసం రూ.8 కోట్లకు ప్రతిపాదనలు పంపారని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వైసీపీ నాయకులు నిధులు తెచ్చుకోలేకపోయారని అన్నారు. రైతుల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా కృషి చేశారన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేసింది టీడీపీ హయాంలోనేనన్నారు. 30 ఏళ్లుగా దేశాయి చెరువు కింద రైతులకు నీరందించింది టీడీపీయేనన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తుగ్గలి, జనవరి 20: కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2003లో 10వ తరగతి చదివిన ప్రసాద్ హైదరాబాద్‌లో జీవనం సాగిస్తూ ఉండేవాడు. గత నెల 27న గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న 2003 10వ తరగతి బ్యాచ్ మిత్రులు వారి కుటుంబ పోషణ కోసం రూ.35 వేలు నగదును స్నేహితుడి భార్య ఎర్రనా గమ్మకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003లో చదివిన విద్యార్థులు మిత్రులకు ఏవైన అనుకోని సంఘటన వల్ల మృతి చెందితే ప్రతి కుటుంబానికి తమ బ్యాచ్ తరఫున ఆర్థిక సాయం అందించడంతోపాటు వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

ముగిసిన నవోదయ పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్, జనవరి 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించిన జవహర్ నవోదయ ఆరో తరగతి ఎంపిక (2024)పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష కోసం శనివారం నిర్వహించిన పరీక్షలలో 4813 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 6120 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా ఇందులో 4813 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆమె తెలిపారు. మొత్తం 22 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించామని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని చెప్పారు.

ఆదోని(అగ్రికల్చర్)/ ఆలూరు: ఆదోని, ఆలూరులలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఆదోనిలో నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ఆలూరులో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1,2లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.